క్లుప్తంగా

జీవనోపాధులను మెరుగుపర్చుకోవాలి



శిక్షణ ఇస్తున్న సీసీ సూర్యనారాయణ

ఓర్వకల్లు: పొదుపు సంఘాలలోని సభ్యులు తమ జీవనోపాధులను మెరుగుపర్చుకోవాలని ఏపీఎం వెంకటరామిరెడ్డి సూచించారు. గురువారం స్థానిక పొదుపు భవనంలో ఎస్‌హెచ్‌జీ ఎన్యూమరేటర్లకు, వీఓఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాల ద్వారా మహిళలు స్వయం ఉపాధిలో రాణించేలా అవగాహన కల్పించాలన్నారు.

తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న వాహనం

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యం చెంచుకాలనీ వద్ద బ్రిడ్జిపై పెను ప్రమాదం తప్పింది. గురువారం నందవరం నుంచి కడపకు వెళ్తున్న వాహనం సర్వీస్ రోడ్డు నుంచి హైవే పైకి ఎక్కుతున్న సమయంలో ప్లైఓవర్‌పై వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. వాహనం డ్రైవర్ చాకచక్యంతో సైడ్‌కు తిప్పడంతో పెను ప్రమాదం తప్పింది. వాహనంలో ఉన్న వారంతా క్షేమంగా బయటపట్టారు. నందవరం జ్యోతుల వేడుకను చూసుకోని స్వగ్రామమైన కడపకు వెళ్తుండగా ఈ ఘనట చోటు చేసుకుంది. రోడ్డుపై నిలిచిన రెండు వాహనాలను హైవే పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు



చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీపీ తిప్పన్న

ఓర్వకల్లు: వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీపీ తిప్పన్న అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి వెంకటరామయ్య, ఈఓఆర్‌డీ సుబ్బరాయుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

సి.బెళగల్: బ్యాంక్ లింకేజీ రుణాలు తీసుకున్న పొదుపు గ్రూపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం రామేశ్వర్ అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో పొదుపు మహిళలకు జీవనోపాధులపై రెండవ రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంఎంఎస్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి అధ్యక్షతన గురువారం ఆయన నిర్వహించారు. శిక్షణలో ఏపీఎం మాట్లాడుతూ.. రుణాలతో పెరటి కోళ్ల పెంపకం, డైయిరీ ఫామ్‌ల నిర్వహణ, కుటీర పరిశ్రమలు, కిరాణం, దుకాణాలు, హోటళ్లను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు శ్రీనివాసులు, రాముడు, గుండమయ్య, మహాబాష, మాదులు, ఎంఎస్ అకౌంటెంట్ గోవిందు తదితరులు ఉన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

కర్నూలు: కర్నూలు కొత్తపేటకు చెందిన షేక్ ముంతాజ్ బేగం (36) అనారోగ్యంతో బాధ తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. భర్త షాకిర్ బాషా గౌండా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ముంతాజ్ బేగం గర్భాశయానికి సంబంధించిన వ్యాధితో బాధపడుతూ నాలుగేళ్ల క్రితం శస్త్రచికిత్స చేయించుకున్నారు. అయినప్పటికీ సమస్య తలెత్తుతుండటంతో తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఫినాయిల్ తాగి ఇంట్లో అపస్మారక స్థితిలో పడివుండగా కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. కోలుకోలేక గురువారం తెల్లవారుజామున ఆమె మృతిచెందింది. రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

గౌండా ఆత్మహత్య

కర్నూలు: పాతబస్తీలోని గడ్డా వీధిలో నివాసముంటున్న కరీముల్లా (32) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన గౌండా పని చేస్తూ జీవనం సాగించేవాడు. కొన్నాళ్ల క్రితం ప్రమాదానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. ఆర్థికంగా చితికిపోయి ఇబ్బందులు తాళలేక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

ప్ర‘జల’ కష్టం తీర్చే భాగ్యం కల్పించండి!



పడిదెంపాడులో నిరుపయోగంగా ఉన్న చేతిపంపు

‘ఎంతో మంది దాహం తీర్చాము. మండు వేసవిలో కాలనీల్లో నీటి ఎద్దడి నివారణకు మేమెంతో సాయపడ్డాం. భూగర్భంలోని నీటిని తెచ్చి బిందెలను నింపాము. ఇప్పుడు మమ్మల్ని నిరుపయోగంగా మార్చేశారు. కొన్నేళ్లుగా ఇలాగే ఉండి ‘బోరు’ కొడుతోంది. దిష్టిబొమ్మల్లా నిలిచిన మాకు మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తెస్తే ప్రజల నీటి కష్టాలను పరిష్కరించే భాగ్యం కలుగుతుంది’.. అంటూ పడిదెంపాడు శివాలయం పక్కన, గార్గేయపురం గ్రామంలోని బీసీ కాలనీలోని రెండు చేతి పంపులు అధికారులకు మొర పెట్టుకుంటున్నాయి.

– కర్నూలు(రూరల్)



గార్గేయపురం బీసీ కాలనీలో శిథిలావస్థలో బోరు

పురాణ ఇతిహాసాలను పఠనం చేయాలి

కర్నూలు కల్చరల్: భగవాన్ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నెహ్రూనగర్‌లోని సాయి మందిరంలో నిర్వహిస్తున్న శ్రీరామ కథా వాహిని కార్యక్రమంలో భాగంగా గురువారం భాస్కర రామాయణం, భాగవతంపై ప్రభుత్వ బీఈడీ కళాశాల తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి ఉపన్యసించారు. పురాణ ఇతిహాసాలైన భారత, భాగవతం, రామాయణాలను ప్రతిఒక్కరూ పఠనం, శ్రవణం చేయాలన్నారు. విద్యార్థులకు వీటిపై అవగాహన కల్పించాలన్నారు. వీటిని అనుసరించడంతో జీవితంలో మార్పు వస్తుందన్నారు. సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కన్వీనర్ మాకా అశోక్, మాజీ అధ్యక్షుడు సాయిబాబా, సేవాదల్ జిల్లా బాధ్యులు లక్ష్మీ సరోజ, సభ్యులు పాల్గొన్నారు.



ఉపన్యసిస్తున్న డాక్టర్ దండబోయిన పార్వతీ దేవి

ఆస్పత్రుల్లోని జనన, మరణాల డేటా పంపండి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో సంభవించిన జననాలు, మరణాల వివరాలను 10 రోజుల్లో నగరపాలక సంస్థకు పంపాలని ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. వివరాలను పంపడంలో జాప్యం చేస్తే ఒక్కో జననం, మరణంపై రూ.2 వేలు జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. జరిమానాను ఆస్పత్రి యాజమాన్యమే భరించాల్సి ఉంటుందని, చికిత్సకు వచ్చిన వారి నుంచి వసూలు చేసినట్లు తమ దృష్టికి వస్తే ఆస్పత్రిని సీజ్ చేసేలా జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌ఓలకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు.

10 వరకు స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్ బ్యాక్ సేకరణ

ఈనెల 10వ తేదీ వరకు స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్ బ్యాక్ అభిప్రాయాలను పంపించవచ్చని ఆరోగ్య శాఖ అధికారి తెలిపారు. నగరాన్ని జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు సహకరించాలని https://sbmurban.org/feedback వెబ్‌సైట్ ద్వారా అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

కర్నూలు సిటీ: నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రీజనల్, డిపో కమిటీల ఆధ్వర్యంలో గురువారం డిపో-1, డిపో-2ల ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు రెడ్ రెబ్బన్ ధరించి నిరసన తెలిపారు. ఈ నిరసనలో ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.ఎం.డి ఇస్మాయిల్, రీజినల్ ప్రెసిడెంట్ ఎస్.ఆర్ నాయుడు, డిపో-1 కార్యదర్శి సయ్యద్ ఇసాక్, డిపో-2 కార్యదర్శి ఎం.ఎస్.బి రెడ్డి పాల్గొని ప్రసంగించారు. వివిధ డిపోల్లో పని చేస్తున్న ఉద్యోగులపై పని భారం పెరిగిపోయిందని, పని భారాన్ని తగ్గించి, ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయాలన్నారు. అలాగే అర్హులైన వారందరికీ పదోన్నతులు కల్పించాలన్నారు. అలాగే ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వాలని, గతంలో నిలిపి వేసిన వాటిని పునరుద్ధరించాలని కోరారు. ఆరు నెలలకు ఒకసారి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని, సీలింగ్ లేని వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న లీవ్ ఎన్‌క్యాష్ చెల్లించాలని కోరారు. సంఘం నాయకులు డిపో-1 గ్యారేజీ కార్యదర్శి రవీంద్రబాబు, డిపో-2 కార్యదర్శి తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతి గృహం తనిఖీ

కర్నూలు (టౌన్): స్థానిక ఇందిరాగాంధీ నగర్‌లో ఉన్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి తనిఖీ చేశారు. కార్యాలయంలో రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించడం లేదని, అక్కడున్న నిర్వహకురాలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న మహిళలు, వృద్ధులతో మాట్లాడి సదుపాయాల గురించి ఆరా తీశారు. అయితే వారంతా నిర్వహకురాలిపై ఫిర్యాదు చేశారు. భోజన వసతి, వైద్య సదుపాయాలు కల్పించడం లేదన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో సౌకర్యాలు మెరుగుపరచేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడతమన్నారు. వసతి గృహ నిర్వాహకురాలు శకుంతల, తదితరులు పాల్గొన్నారు.



వసతి గృహంలోని వృద్ధులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

6న సీతారాముల కల్యాణోత్సవం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్: శ్రీరామనవమి పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు కె.క్రిష్ణన్న పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రోజా వీధిలోని అహోపా కార్యాలయంలో కల్యాణోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా గోశాలలో 5వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పసుపు, తలంబ్రాల సేవ, తిరుమంజన సేవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మున్సిపల్ హైస్కూల్ మైదానంలో సాయంత్రం 5 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, 6.30 గంటలకు సీతారాముల కల్యాణం, ప్రసాద వితరణ ఉంటాయన్నారు. సమితి ఉపాధ్యక్షుడు మహాబలేష్, ఎస్వీ నారాయణ రెడ్డి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



పొదుపు మహిళలతో మాట్లాడుతున్న ఏపీఎం రామేశ్వర్

సి.బెళగల్: బ్యాంక్ లింకేజీ రుణాలు తీసుకున్న పొదుపు గ్రూపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం రామేశ్వర్ అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో పొదుపు మహిళలకు జీవనోపాధులపై రెండవ రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంఎంఎస్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి అధ్యక్షతన గురువారం ఆయన నిర్వహించారు. శిక్షణలో ఏపీఎం మాట్లాడుతూ.. రుణాలతో పెరటి కోళ్ల పెంపకం, డైయిరీ ఫామ్‌ల నిర్వహణ, కుటీర పరిశ్రమలు, కిరాణం, దుకాణాలు, హోటళ్లను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు శ్రీనివాసులు, రాముడు, గుండమయ్య, మహాబాష, మాదులు, ఎంఎస్ అకౌంటెంట్ గోవిందు తదితరులు ఉన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఓర్వకల్లు: పొదుపు మహిళలు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని హుసేనాపురం గ్రామైక్య సంఘం కార్యాలయం వద్ద కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని నిర్వహించారు. మండల మహిళ సమాఖ్య గౌరవ సలహాదారురాలు విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పొదుపు సంఘాల ద్వారా మహిళలు సాధించిన ఆర్థిక స్వావలంబన దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిల్వడం హర్షించదగ్గ విషయమన్నారు. అదే స్ఫూర్తితో మహిళలు తమ సొంత కాళ్లమీద జీవించడానికి స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న కెనరా బ్యాంక్ వారి సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచు చంద్ర గోవర్ధనమ్మ, ఉప సర్పంచు షమీన బేగం, స్థానిక నాయకులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.



మహిళలకు టైలరింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

6న అండర్-19 క్రికెట్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 6 వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉన్న క్రికెట్ నెట్స్‌లో అండర్-19 విభాగంలో క్రికెట్ జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.దేవేంద్రగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు నేరుగా పాల్గొనవచ్చన్నారు. 2006 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులని తెలిపారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్ 12, 13 తేదీల్లో కర్నూలులో జరిగే సీఐటీయూ రాష్ట్రస్థాయి వర్క్‌షాపును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులను చైతన్యం చేసేందుకు వివిధ ప్రాంతాల్లో వర్క్‌షాపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా కర్నూలు నగరంలో నిర్వహించే వర్క్‌షాపునకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింహరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, ఇతర రాష్ట్ర నాయకత్వం పాల్గొంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై వర్క్‌షాపులో చర్చించనున్నట్లు చెప్పారు. నాయకులు జే.నాగేశ్వరరావు, సాయిబాబా, విజయ్, ప్రభాకర్, నారాయణ స్వామి, ఉమాదేవి పాల్గొన్నారు.

విజయవాడకు రైలును నడపండి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు-విజయవాడ, కర్నూలు-ముంబాయి మధ్య నేరుగా నడిచే రైలును నడపాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. ఆయన గురువారం ఢిల్లీలో రైల్వే శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. గతంలో కూడా ఆయా రైళ్లు, ఓర్వకల్ ఇండస్ట్రియల్ కారిడార్‌కు ప్రత్యేక రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేయాలని విన్నావించామని, అయినా ఇంతవరకు అభివృద్ధి చేయలేదన్నారు.

పెద్దాసుపత్రి వంటశాల తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని వంటశాలను గురువారం ఆహార భద్రత విభాగం అధికారులు తనిఖీ చేశారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మానాయకులు ఆదేశాలతో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్ ఈ తనిఖీలు చేపట్టారు. అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం వండుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహారం ఇలాగేనా తయారు చేసేది అని ప్రశ్నించారు. అలాగే ఆహారం తయారీలో నాణ్యతలేని సరుకులు, కూరగాయలను వాడుతున్నారని మండిపడ్డారు. శనగ బ్యాళ్లు, కందిబ్యాళ్ల శ్యాంపిల్స్ సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబోరేటరీకి పంపినట్లు రాజగోపాల్ తెలిపారు.

5న గరికపాటి ప్రవచనం

కర్నూలు కల్చరల్: భగవాన్ సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ మహా సహస్రావధాని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచనం ఏర్పాటు చేసినట్లు సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు డి.కృష్ణారెడ్డి, కన్వీనర్ మాకా అశోక్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం నెహ్రూ నగర్‌లోని సాయి మందిరంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించా రు. వారు మాట్లాడుతూ.. ‘శ్రీమద్ రామాయణం’ (మానవతా విలువలు- వ్యక్తిత్వ వికాసం) అనే అంశంపై 5వ తేదీ సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు గరికపాటి వారు ప్రవచనం చెబు తారన్నారు. ప్రవచనం వింటూ వీక్షించేందుకు నాలుగు భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సాయి సేవా సంస్థల వలంటీర్లు, భక్తులు అందరూ పాల్గొనవచ్చన్నారు. మాజీ అధ్యక్షుడు సాయిబాబ, జిల్లా సేవాదల్ బాధ్యులు లక్ష్మీసరోజ తదితరులు పాల్గొన్నారు.

పత్తిని ముందస్తుగా విత్తుకోవద్దు



సి.బెళగల్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: వేసవిలో ముందస్తు పత్తి పంటల సాగు చేయవద్దని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ సూచించారు. గురువారం ఆయన స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించి ఖరీఫ్ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా జూలై నెలలో పత్తి పంటల సాగు అనుకూలంగా ఉంటుందని అన్నారు. అదేవిధంగా వ్యవసాయ యంత్రాలు, ట్రాక్టర్ల పనిముట్లు సబ్సిడీలో పొందాలనుకున్న రైతులు ఆయా గ్రామాల్లోని వ్యవసాయ సిబ్బందిని కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలియజేశారు.

చిన్నపాటి వర్షానికే ఇలా..

ఓర్వకల్లు: ఈ చిత్రంలో కనిపిస్తున్నది మండలంలోని ఉప్పలపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనం. గత పదేళ్ల వరకు ప్రాథమిక తరగతులను ఈ భవనంలోనే నిర్వహించేవారు. ఆ తర్వాత ఊరు బయట నిర్మించిన కొత్త భవనాలలోకి మార్చుచేశారు. పదేళ్ల క్రితం రెండు అంగన్ వాడీ కేంద్రాలను ఈ భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో గదుల గోడలు చీలికలు ఏర్పడి, చిన్నపాటి వర్షానికే గోడల నుంచి వర్షపునీరు చేరి పిల్లలు కూర్చోవడానికి ఇబ్బందిగా మారింది. దీనికి తోడు ఇటీవల టీడీపీ వారు అనాలోచితంగా నిర్మించిన సీసీ రోడ్డు కారణంగా వర్షపునీరు పోటెత్తడంతో గదుల్లోకి చేరి, వంట సరుకులు, గుడ్లు, బియ్యం పూర్తిగా దెబ్బతింటున్నాయి. గురువారం కురిసిన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో రెండు కేంద్రాలలోకి వర్షపునీరు చేరి, వంట సామగ్రి పూర్తిగా తడిచి ముద్దయ్యాయి. ఆ నీటి తోడిపోసేందుకు గంటసేపు అవస్థలు పడాల్సివస్తోందని వాపోతున్నారు. గతంలో ఈ సమస్యను గూర్చి పలుసార్లు జిల్లా కలెక్టర్‌తో పాటు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్యకు పరిష్కారం చూపాలని, లేదంటే అంగన్ వాడి కేంద్రాలకు సొంత భవనాలు మంజూరు చేయాల్సిందిగా గ్రామ ప్రజలు కోరుతున్నారు.



అంగన్ వాడీ కేంద్రంలోకి చేరిన వర్షపు నీటిని తోడేస్తున్న దృశ్యం

నిధుల దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు

● పీడీ వెంకటరమణయ్య

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య హెచ్చరించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఉపాధి పనులకు ఖర్చుచేసిన నిధులపై గత నెల 22వ తేదీ నుంచి ఈనెల 2వ తేదీ వరకు గ్రామాల వారీగా సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో వెల్లడైన అవినీతి, అక్రమాలపై గురువారం స్థానిక జాతీయ ఉపాధి హామీ కార్యాలయం వద్ద బహిరంగ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి పీడీతో పాటు, డ్వామా అదనపు పీడీ మాధవీలత, డీవీఓ లోకేశ్వర రావు, ఎస్ఆర్‌పీ విజయభాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ వెంకటరమణయ్య మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 22 గ్రామ పంచాయతీలలో ఉపాధి కూలీల ద్వారా రూ.12,61,68,441, యంత్రాల ద్వారా రూ.3,66,17,193 చొప్పున కలిపి మొత్తం రూ.16,27,65,634 ఖర్చుచేసినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు తేల్చినట్లు పేర్కొన్నారు. ఇందులో రూ.1.73 లక్షల నిధులు దుర్వినియోగం కావడంతో వసూలు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కొన్నిచోట్ల క్షేత్ర స్థాయి సిబ్బంది విధుల పట్ల, నిర్లక్ష్యం, అలసత్వం నిర్వహించడంతో రూ.95 వేల జరిమానా విధించినట్లు డ్వామా అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ పద్మావతి, ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, టీఏలు, ఎఫ్ఏలు, ఉపాధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో రికార్డులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరమణయ్య

మూడు ఇళ్లలో చోరీ

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలో మూడు ఇళ్లలో చోరీ జరిగింది. దొంగలు గురువారం తెల్లవారుజామున తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దోచుకున్నారు. కృష్ణ అనే వ్యక్తి ఇంటిలో రూ. 60 వేలు, మిగిలిన రెండు ఇళ్లలో బంగారు ఉంగరాలు అపహరించారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి టీమ్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.

కబడ్డీ కూత.. కేరింతల మోత

ఎస్. కొట్టాల గ్రామంలో ఉరుసు సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి మహిళ కబడ్డీ పోటీలు గురువారం రసవత్తరంగా ప్రారంభమయ్యాయి. వివిధ రాష్ట్రాల జట్లు తరలివచ్చాయి. పోటీలు హోరాహోరీగా సాగాయి. క్రీడా స్ఫూర్తి చాటుతూ క్రీడాకారిణులు పోటీలో తలపడుతుండగా.. క్రీడాభిమానులు కేరింతలు, చప్పట్లతో ఉత్సాహపరిచారు. పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. అలాగే మూడు రోజుల క్రితం కొత్తూరు గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా ప్రారంభించిన మహిళా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో గుజరాత్, విజయనగరం, ఉత్తరాఖండ్, తమిళనాడు, చిత్తూరు జట్లు విజేతగా నిలిచి బహుమతులు అందుకున్నాయి.

– పాణ్యం



పోటీలో తలపడిన క్రీడాకారిణులు



నేటి నుంచి గుండ్రేవులలో ఉరుసు



బడేషాఖాద్రి దర్గా



సి.బెళగల్: గుండ్రేవుల గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ షా జలాలుద్దీన్ ఖాద్రీ (బడేషా ఖాద్రి) ఉరుసు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు పీఠాధిపతి సయ్యద్ రసూల్ ఖాద్రీ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉరుసుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు నిర్వాహకులు సయ్యద్ రసూల్ సామాబ్ ఖాద్రీ, సయ్యద్ బాబు ఖాద్రీ, బడేసాసామాబ్ ఖాద్రీ తెలిపారు. బడేషా ఖాద్రి దర్గాతో పాటు గ్రామంలోని దస్తగిరయ్య, పెద్దయ్య దర్గాలను రంగు రంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. దర్గాకు వెళ్లే మార్గంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారస్తులు ఆట వస్తువులు, తినుబండారాల అంగళ్లను ఏర్పాటు చేశారు. అలాగే ఇనగండ్ల గ్రామంలో హజరత్ సయ్యద్ షా జలాలుద్దీన్ ఖాద్రీ అల్ మారుఫ్ సయ్యద్ షా బడేషా ఖాద్రీ 19వ ఉరుసు శుక్రవారం నుంచి ప్రారంభకానుంది. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత దర్గాకు గంధాన్ని చేర్చడం, ఆదివారం జియారత్ ఫాతెహా (కిస్తీ) కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.